క్లుప్తంగా

విద్యుత్ అధికారుల 'పొలంబాట'



రుద్రూర్: పొతంగల్ మండలం టాక్లి గ్రామంలో రుద్రూర్ ట్రాన్స్‌కో ఏడీ నగేశ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యుత్ సమస్యలుంటే సంబంధిత అధికారులు, సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పొతంగల్ ట్రాన్స్‌కో ఏఈ ఫక్రుద్దీన్ ఖాద్రి, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, లైన్‌మన్ దినేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వంగడాలను సాగు చేయాలి



బాల్కొండ: పసుపు పంటలో నూతన వంగడాలను రైతులు సాగు చేయాలని కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మహేందర్ అన్నారు. శనివారం ముప్కాల్ మండలం వేంపల్లిలో పసుపు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు సాగులో నూతన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి వినయ్, రైతులు పాల్గొన్నారు.

అలరించిన వైజ్ఞానిక ప్రదర్శన

పెర్కిట్: మామిడిపల్లిలో ఉన్న కృష్ణవేణి పాఠశాలలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆహుతులను అలరించింది. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన అంశాల తో పలు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ మిన్హాజ్, జోనల్ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు విజయ్ కర్తన్, నాగేశ్వర్ రావు, మోహిసిన్ జాబ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలువ



బాల్కొండ: మెండోరా మండలం సావెల్ గ్రామం వద్ద కాకతీయ ఉప కాలువ ప్రమాదకరంగా ఉంది. కాలువ అంచున ఉన్న రోడ్డుపై ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రోడ్డు పక్కన ఉండే సైడ్ వాల్ ఇటీవల ధ్వంసమైంది. దీంతో అటుగా వెళ్లే వాహనాలు అదుపుతప్పి కాలువలో పడితే అంతేసంగతి. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

పెర్కిట్: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదివిన సాయన్న కుటుంబ సభ్యులకు పూర్వ విద్యార్థులు శనివారం రూ.38 వేల ఆర్థికసాయం అందజేశారు. సాయన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు వారు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సట్లపల్లి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని విమర్శిస్తే సహించం

ఆర్మూర్‌టౌన్: ఎంపీ అర్వింద్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకుడు ఏబీ శ్రీనివాస్‌కు లేదని బీజేపీ నాయకులు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు ఆధ్వర్యంలో నాయకులు సమావేశం నిర్వహించారు. ఎంపీపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఏబీ శ్రీనివాస్‌ను ఆర్మూర్‌లో తిరగనివ్వమన్నారు. నాయకులు జీవీ నర్సింహారెడ్డి, కంచెట్టి గంగాధర్, జెస్సు అనిల్, పాలెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకును కాపాడిన పోలీసులు

బాల్కొండ: ఎస్సారెస్పీ ప్రాజెక్టులో దూకడానికి వచ్చిన తల్లీకొడుకును స్థానిక పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా..నిర్మల్ జిల్లా భాగ్యనగర్ చెందిన ఓ వివాహిత భర్తతో గొడవపడి, కుమారుడిని వెంట తీసుకొని మెండోరా మండలం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్దకు వచ్చింది. ప్రాజెక్టు వద్ద రోధిస్తూ ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై నారాయణ సిబ్బందితో కలిసి అక్కడకు వచ్చి వివాహితతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఠాణాకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైద్యుడికి ఘన నివాళులు

బాల్కొండ: ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ గుండెపోటుతో మృతి చెందడంతో బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైద్యుడు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్' కల నెరవేరేనా?

- మెండోరాలో ఇంకా పూర్తికాని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం
- ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న పనులు



మెండోరాలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కల నెరవేరేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలో 60 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం 2017లో అప్పటి పాలకులు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ వస్తున్నాయి. ఎట్టకేలకు భవనాలు పూర్తికాగా, సౌకర్యాల ఏర్పాట్లు ఇప్పటివరకు పూర్తికాలేదు. ఇళ్లలో కింద ఫ్లోరింగ్, కిటికీలకు తలుపులు, నీటి వసతి, కరెంట్ సౌకర్యం ఇవేవి చేపట్టలేదు. భవనాలకు మాత్రం రంగులు వేసి వదిలేశారు. పనులను ఎప్పుడు పూర్తిచేస్తారో కూడా అధికారులకు తెలియడం లేదు.

మందు బాబులకు అడ్డా..

మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఊరికి చివర నిర్మించారు. ప్రస్తుతం ఆ నిర్మాణాలు మందు బాబులకు అడ్డాగా మారాయి. నిత్యం మందుబాబులు ఈ ప్రదేశంలో మద్యం తాగుతున్నారు. తాగిన మైకంలో సీసాలను పగుల గొడుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు కూడ అడ్డగా మారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు పూర్తిచేస్తాం

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కనీస వసతుల ఏర్పాట్లను త్వరలోనే పూర్తి చేస్తాం. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక విభాగం పనిచేస్తుంది. వారికి అప్పగించి పూర్తి చేసే అవకాశం ఉంది.

– నాందేవ్, ఆర్అండ్‌బీ డీఈఈ, బాల్కొండ

ఎలాంటి సమాచారం లేదు..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల గురించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. ఉన్నత అధికారులు కూడా ఎలాంటి ఆదేశాలివ్వలేదు. ఇవి ఇందిరమ్మ ఇళ్ల పరిధిలోకి వస్తాయో రావో తెలియదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– వనజ, ఎంపీడీవో, మెండోరా

మూలన పడ్డ బోటు



బాల్కొండ: ఎస్సారెస్పీలో కొంత కాలంగా బోటు షికారు నిలిచిపోయింది. దీంతో అందులో ఉన్న బోటు మూలనపడింది. బోటు సేవలు లేకపోవడంతో ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చే పర్యాటకులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. అధికారులు స్పందించి బోటు సేవలను పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టరూ..

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో కుళాయి వద్ద ఉన్న సిమెంట్ ప్లాట్ ఫారం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కింద పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆసుపత్రికి వచ్చే రోగులు కోరుతున్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



బోధన్‌టౌన్: అర్హులైన అగ్రవర్ణ కులాల్లోని నిరుపేద యువతకు రాజీవ్‌యువ వికాసం పథకంలో అవకాశం కల్పించాలని రెడ్డి ఐక్యవేదిక సంఘం ప్రతినిధులు శనివారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుడిపల్లి నాగిరెడ్డి, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా బోనాల పండుగ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పెద్ద బజార్ ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్దమ్మ తల్లి బోనాల పండుగను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బోన్ల సంతోషం, జక్కం శేఖర్, సుంకరి మోని, జక్కం భూమన్న, జిన్నా సుమన్, సుంకరి శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



డ్రగ్స్ నియంత్రణ స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్

ఆర్మూర్‌టౌన్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై స్టిక్కర్లను ఎస్‌హెచ్‌వో ఆవిష్కరించారు. ప్రతిఒక్కరు డ్రగ్స్ నియంత్రణకు తోడ్పడాలన్నారు. అనంతరం బస్టాండ్ ప్రాంతలో ఆటోలకు డ్రగ్స్ నియంత్రణ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఇంద్రకరణ్ రెడ్డి, మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నవీపేట: లావాదేవీలు నిర్వహించే మహిళలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వినయ్ సూచించారు. ఐకేపీ కార్యాలయంలో సైబర్ మోసాలపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఫోన్‌లలో వస్తున్న ఎలాంటి మెసేజ్‌లకైనా రిప్లై ఇవ్వద్దని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీపై చర్యకు తీర్మానం



సభలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్

నవీపేట: రుణమాఫీ పథకం వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చగా సాంకేతిక లోపంతో మాఫీ వర్తించలేదని, సంబంధిత సాఫ్ట్‌వేర్ కంపెనీపై చర్య తీసుకోవాలని బినోల సొసైటీ సభ్యులు తీర్మానం చేశారు. సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడు మగ్గారి హన్మాండ్లు అధ్యక్షతన 63వ మహాజన సభ జరిగింది. రైతులకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. 2025లో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇన్‌చార్జిలను నియమిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఖాజా ఆశమొద్దీన్, డైరెక్టర్లు విజయ్, బాల్‌రాజ్‌గౌడ్, అంజగాగౌడ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శిక్షకుడు నరేశ్

బోధన్: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ కేంద్రంలోని రైతు వేదిక భవనంలో డివిజన్ స్థాయి జీపీ కార్యదర్శులు, వైద్యసిబ్బందికి క్షయ నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి రహిత గ్రామాలు తీర్చిదిద్దేందుకు ఆ వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు, వైద్య చికిత్స అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసినట్లయితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజు, ఎండీపీవో, ఎంపీవోలు, శిక్షకుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

బోధన్‌టౌన్: కార్మికుల సంక్షమాన్ని దృష్టిలో పెట్టుకొని నిరంతరం ఉద్యమాలు చేసే కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేసి ప్రజా స్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూనీ చేస్తోందని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి మల్లేశ్, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు వరదయ్య అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తలపెట్టి ధర్నాకు వెళ్లనున్న కార్మిక సంఘాల నాయకులను పోలీసులు శనివారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఆర్మూర్‌టౌన్: అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని టీయూసీఐ, సీఐటీయూ నాయకులు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో శనివారం ఉదయం పోలీసులు టీయూసీఐ, సీఐటీయూ నాయకులు ముత్తన్న, కుతాడి ఎల్లయ్య, నిఖిల్, మునీర్‌ను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. హైదరాబాద్‌లో కార్మికుల మహాధర్నా చేపడుతున్న తరుణంలో పోలీసులు నాయకులను అరెస్టు చేయడం తగదని అన్నారు.

బోధన్ తైబజార్ @ రూ. 23లక్షలు

బోధన్‌టౌన్: బోధన్ తైబజార్ వేలం రూ. 23లక్షల 45వేలకు జరిగినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ తెలిపారు. శనివారం బోధన్ బల్దియా కార్యాలయంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి తైబజార్ వేలం నిర్వహించగా మహ్మద్ కబీర్ అహ్మద్ అనే వ్యక్తి రూ. 23లక్షల45వేలకు వేలం దక్కించుకున్నాడని పేర్కొన్నారు. అదేవిధంగా జంతు వధశాలకు వేలం నిర్వహించగా అబ్దుల్ అజీజ్ రూ. 4లక్షల52 వేలకు వేలం పాడి దక్కించుకున్నాడు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాపంథా ఆర్మూర్ కార్యదర్శి బి కిషన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం నరేందర్, నాయకులు రవి, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహం

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్)లో వారం రోజులుగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహం శనివారం ముగిసింది. చివరి రోజు దెగ్లూర్‌కు చెందిన లక్ష్మీకాంత్ మహరాజ్ కీర్తనలు కొనసాగాయి. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

పెర్కిట్: ప్రభుత్వం ఎండీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లో ఈ నెల 24న నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు వెంకటేశ్, ఎల్లయ్య పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికులు శనివారం ఆర్మూర్ ఎమ్మార్సీ కార్యాలయంలోని అధికారులకు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీఎం కార్మికులు జక్కం సుజాత, సత్తెమ్మ, దేవాయి, భవిత, భూదేవి, లక్ష్మి, స్వరూప, నర్సుబాయి తదితరులు పాల్గొన్నారు.

కే సాట్‌లో విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్: మామిడిపల్లిలోని నలంద హైస్కూల్ విద్యార్థులు కలాం సెంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్కారం ప్రసాద్, ప్రిన్సిపాల్ లక్కారం సాగర్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఈ అభ్యాస్ అకాడమీ వారు గత నెలలో రాష్ట్ర స్థాయి కే సాట్ టెస్ట్ నిర్వహించా రు. పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. దీంతో పా ఠశాల యాజమాన్యం విద్యార్థులను ప్రశంస ప త్రాలతో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వీ నాయకుడి ముందస్తు అరెస్టు

మోర్తాడ్: చలో అసెంబ్లీ పిలుపులో భాగంగా బీఆర్‌ఎస్‌వీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్‌వీ బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడు శిరవేణి శివకుమార్‌ను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ వెళ్లే క్రమంలో తనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని శివకుమార్ ఆరోపించారు. చలో అసెంబ్లీ పిలుపు ఎన్నో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోవడం కోసమని ఆయన వెల్లడించారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి



భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న డీపీఎం సాయిలు



అవగాహన కల్పిస్తున్న డీపీఎం మారుతి

మోర్తాడ్: మానవ అక్రమ రవాణాను నిరోధించడంలో అందరూ సహకరించాలని పేదరిక నిర్మూలన సంస్థ డీపీఎం సాయిలు అన్నారు. శనివారం భీమ్‌గల్ మండల సమాఖ్య భవనంలో గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలకు అవగాహన సమావేశం నిర్వహించారు. మానవ అక్రమ రవాణాలో ప్రధానంగా బాలికలకే అన్యాయం జరుగుతుందని అన్నారు. అక్రమ రవాణా వల్ల లైంగిక వేధింపులు, అవయవాల దోపిడి జరుగుతుందని తెలిపారు. అందుకే మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామాలకు వచ్చే అపరిచితులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు కుంట శ్రీనివాస్, పురా స్తు నరేశ్, గంగాసాయిలు, రఘు, భాస్కర్, గంగాధర్, సుమలత, గంగాలలిత, గణేశ్, ముత్యం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మానవ అక్రమ రవాణాను నివారించే అంశంపై మహిళా సంఘ సభ్యులందరికీ అవగాహన కల్పించాలని ఐకేపీ వ్యవసాయ విభాగం జిల్లా డీపీఎం మారుతి పేర్కొన్నారు. శనివారం కమ్మర్‌పల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వా ట్సాప్ తదితర సామాజిక మాద్యమాల ద్వారా మహిళలతో మాటలు కలిపి వారిని వక్రమార్గంలోకి పయనించేలా చేస్తున్నారన్నారు. ఏపీఎం కుంట గంగాధర్, సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి, సీసీలు రవికుమార్, పీర్యా, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి నసీమా సుల్తానా

పెర్కిట్: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా చూసుకోవాలని ఆర్మూర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా సూచించారు. ఆలూర్ మండలం మిర్ధాపల్లిలో శనివారం మండల లీగల్ అవేర్నెస్ కమిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి హాజరై మాట్లాడారు. అన్నాదమ్ముళ్లు ఆస్తుల విషయంలో బంధాలను మరిచిపోయి శత్రువులుగా మారడం సరికాదన్నారు. సమస్యలు తలెత్తినపుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యం

ఆర్మూర్‌టౌన్: సమాజ సేవే ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన సుంకె శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటైన మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థను ఆర్డీవో రాజాగౌడ్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు నూకల ఉమాపతి, జంగిడి భోజన్న, గంగామోహన్ రెడ్డి, షేక్ జహిరొద్దీన్, నిశాత్ కుమార్, మధుసూదన్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్ల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పాటి హన్మాన్ దేవాలయంలో నిత్య అన్న ప్రసాద కార్యక్రమం కోసం స్థానిక దాతలు కొమ్ముల గంగాధర్, విజయ దంపతులు 100 స్టీల్ ప్లేట్లు, 50 గ్లాస్‌లను వితరణ చేశారు. శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవాపథకం, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆదేశాల మేరకు ఎయిడ్స్‌ను నియంత్రించడంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జాన్ సుకుమార్, సునీత, లత, యాదగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

రుద్రూర్: హెల్మెట్ వాడకంపై శనివారం రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయన్న అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సురేశ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో శనివారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయగౌడ్ తెలిపారు. మామిడిపల్లి శివారులో డంప్ చేసి ఉన్న ఇసుకను లారీలో తీసుకొని తరలిస్తున్న తరుణంలో జిరాయత్‌నగర్‌లో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ చందు, లారీ యజమాని వీరన్నలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జాన్కంపేట్‌లో గుడిసె దగ్ధం



ఎడపల్లి(బోధన్): మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన దండ్ల నర్సవ్వ గుడిసె కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందిక ఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. తాను ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తన ఇల్లుకు నిప్పుపెట్టారని బాధితురాలు తెలిపింది. ఇంట్లో ఉన్న నిత్యవసర వస్తువులు, దుస్తులు, రూ.30వేల నగదు, రెండు తులాల బంగారం కాలిపోయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

ముగ్గురి అరెస్టు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని జండాగల్లిలో శనివారం మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. మట్కా ఆడుతున్న రమేష్‌తో పాటు రాజు, అజయ్‌లను అదుపులో తీసుకున్నామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 14వేలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్ అందజేత



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న కమిషనర్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) పేమెంట్ చేసిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ కాపీలను మున్సిపల్ కమిషనర్ రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 31 వరకు 25 శాతం డిస్కౌంట్ అవకాశాన్ని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఇప్పటివరకు 322 మంది దరఖాస్తుదారులు తమ పేమెంట్‌ను పూర్తి చేయగా, మున్సిపాలిటీకి ఫీజుల రూపంలో రూ.1.80 కోట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీ అంజనేయులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT NIZAMABAD
I.A.NO. 33 OF 2025.
IN
ARB NO. 300 OF 2024.

Between:
Amruthaditya Chit Fund Pvt. Ltd. Bodhan-Br., Nizamabad Dist. Rep. By Its Foreman M.Raghavendra.
..Disputant

AND

Shaik Imtiyaz Hussain & others
..Opponent

NOTICE

To,
1. Mohammed Aves Khan S/o. MD.Aleem Khan, aged 36 years, Occ : Godown Supervisor O/o. Asst Director of Agriculture Bheemgal Mandal, EMP ID: 2036537, R/o.H.No.1-1-347/,Rakashipet, Bodhan Town and Mandal Nizamabad Dist. 503185. Cell No. 9494256946

Take notice that the above Dispute is filed against you and others for recovery of money. Summons were issued to you. But you have failed to receive the same. The above dispute is posted on 02-04-2025 for your appearance. On that day you have to appear in person at 11:00 AM before the Deputy Registrar referred above. otherwise, the case will be decided ex-parte.

Sd/- **Deputy Registrar of Chits/Arbitrator Nizamabad.**

హసాకొత్తూర్‌లో చలివేంద్రం ప్రారంభం

కమ్మర్‌పల్లి: మండలంలోని హసాకొత్తూర్‌లో శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్సై అనిల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి నర్సయ్య, నాయకులు పడిగెల ప్రవీణ్, రేవతి గంగాధర్, గోపిడి లింగారెడ్డి, ఎడ్ల శ్రీకాంత్, బద్దం రవి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఓ అందాల రాక్షసి 11.00, కిస్ కిస్ కిస్సిక్ 1.45, 7.35, ఆర్టిస్ట్ 4.35, 10.25
స్క్రీన్-2	ఛావా10.00, 4.00, 10.00 షణ్ముక 1.20, 7.20
స్క్రీన్-3	సలార్-పార్ట్-1 10.00, 4.05, 10.10 పెళ్ళికాని ప్రసాద్ 1.30, 7.35
స్క్రీన్-4	కోర్ట్ 10.00, 1.05, 4.10, 7.15, 10.20

మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,900	వెండి(కిలో)	1,04,500
22 క్యారెట్స్	83,897		

– నిజామాబాద్ బిజినెస్